"స్పృహ రావటానికి ఇంకో పావు గంట పట్టవచ్చు" అన్నాడు డాక్టర్ సిరంజ్‌ను ప్రక్కనపెడ్తూ.

"మరేం ప్రమాదంలేదు కదా డాక్టర్?" భయపడ్తూనే అడిగాను.

"నేను చేయాల్సిన ట్రీట్‌మెంట్ అంతా చేశాను. ఆపైన మీ అదృష్టం! ఏమైనా, కావాల్సినవాళ్లను పిలిపించటం అవసరం"

డాక్టర్ నోటివెంట ఆమాట వినగానే నాకు గుండె ఆగినంత పనైంది. కాస్సేపు అలాగే నిలబడిపోయాను.

అవసరమైతే తనకు ఫోన్‌చేయమని చెప్పి డాక్టర్ వెళ్ళిపోయాడు.

"మనం ఆలస్యం చేస్తే లాభంలేదండి! చంద్రం అడ్రస్ చెబితే టెలిగ్రామ్ యిచ్చి వస్తాను" అన్నారు ప్రకాశం పంతులుగారు.

"చంద్రానికి నిన్ననే టెలిగ్రామ్ యిచ్చానండి. ఇంకాస్సేపట్లో వస్తాడు" అన్నాను మెల్లగా బెడ్‌వైపు దృష్టి నిల్పుతూ.

జీవచ్ఛవంలా బెడ్‌మీదవున్న సీతారామయ్యను చూడగానే నా హృదయం భయంతో కంపించిపోయింది. ఎప్పుడూ కళకళలాడుతూ చిఱునవ్వులను చిందించే ఆ వదనం కళావిహీనమై నా మనస్సును తీవ్రంగా కలవరపెడ్తూంది. క్రితం రోజు సాయంకాలం ప్రక్కింటి ప్రకాశంపంతులుగారబ్బాయివచ్చి 'సీతారామయ్యగారు స్పృహతప్పి పడిపోయారండి' అని చెప్పగానే నాకు మిన్ను విరిగి మీద పడ్డట్లయింది. వయస్సు పెరుగుతున్నకొద్దీ మరింత శ్రద్ధతో ఆరోగ్యాన్ని కాపాడుకోవటానికి ప్రయత్నించేవాడు సీతారామయ్య. అలాంటివ్యక్తి అకస్మాత్తుగా స్మారకం లేకుండా పడిపోవటం నాకు చాలా ఆశ్చర్యాన్ని కల్గించింది. హడావుడిగా సీతారామయ్య యింటికి పరిగెత్తుకువచ్చాను. నేను వచ్చేసరికే డాక్టర్ వచ్చి ఇంజక్షన్ చేశాడు ఏదో పావుగంటకు మెల్లగా కళ్ళు తెరిచాడు సీతారామయ్య నన్ను చూడగానే కంటతడిపెట్టుకొన్నాడు ఎంతో గుండెధైర్యంగల మనిషి అలా పిరికివాడిలా కన్నీరు కార్చటం చూసి నేను దిగ్భ్రాంతి చెందాను. మెల్లగా వెళ్లి మంచంమ్మీద కూర్చుని అతని కుడిచేతిని నా చేతుల్లోకి తీసుకొంటూ 'సీతారావుడూ! ఏమిటోయ్ యిది మరీ చిన్నపిల్లాడిలా? ఇప్పుడేమైందని కంటతడి పెడ్తున్నావ్?' అని అడిగేను.

'అయిపోయిందిరా సుందరం!- అంతా అయిపోయింది! నేనిక బ్రతకను' అన్నాడు గద్గద స్వరంతో.

'వయస్సు పెరుగుతున్నకొద్దీ ఎవరికైనా బ్రతుకుమీద తీపి పెరగడం సహజం! అందులో తప్పేమీలేదు!' అని ఎన్నోసార్లు నాతో వాదించిన సీతారామయ్య ఆ రకంగా మాట్లాడేసరికి నేను నిశ్చేష్టుడ నయ్యాను.

'సీతారావుడూ! నీ ధోరణి నాకేం నచ్చలేదు! నిన్నటివరకూ సంతోషంగావున్న నీకు ఇంతలోనే బ్రతుకు పట్ల విరక్తి భావం ఎందుకు కల్గిందో అర్థం కావటంలేదు' అన్నాను.

'బ్రతుకుమీద విరక్తి కల్గటానికి ఎంతో కాలం అక్కర్లేదు సుందరం! ఒక్క క్షణం చాలు!' అన్నాడు కళ్ళు మూసుకొంటూ.

"చాలా వింతగా మాట్లాడుతున్నావ్!"

'లేదురా! నిజం చెప్తున్నాను. నా బ్రతుక్కి ప్రయోజనం లేదన్న విషయాన్ని తెల్సుకొన్నాను' మెల్లగా కళ్ళు తెరుస్తూ అన్నాడు.

'సీతారావుడూ! నీ నోటిమీదుగా ఇలాంటి

మాటలు వస్తాయని కలలోకూడ వూహించ లేదు. నీవీ మాటలు ఆత్మసాక్షిగా పల్కటం లేదు. నీవలన ఎంతమంది అనాథలకు ఆశ్రయం దొరికిందో, ఎంతమంది పేదవారు విద్యావంతులైనారో అప్పుడే మర్చిపోయావా?' నీలాంటి ధర్మదాత, దయార్ద్ర హృదయుడు మరెవ్వరూ వుండరని ప్రజలంతా నిన్ను వేనోళ్ల పొగడటం మర్చిపోయావా?'

'బయటవారు నన్ను బాగా అర్థం చేసుకొన్నారన్న విషయం నాకు తెల్సు! కాని స్వంత మనుషులే నామనసును అర్థంచేసుకోనప్పుడు నా బ్రతుక్కి అర్థం వుందా?' పైన తిరుగుతున్న ఫాన్‌వైపు చూస్తూ అన్నాడు.

స్వంత మనుషులంటే సీతారామయ్య దృష్టిలో ఇద్దరే ఇద్దరు.

అతని స్నేహంలో పాలుపంచుకొనే నేను—

అతని యావదాస్తికి వారసుడైనచంద్రం.

మా ఇద్దరిదీ పాతికేళ్ల స్నేహం. నేను రెవెన్యూ ఇన్‌స్పెక్టరుగా పనిచేస్తున్నప్పుడు అతనితో పరిచయం ఏర్పడింది. అప్పట్లో అతను కంట్రాక్టర్. అతని నీతి, నిజాయితీ కొద్దికాలంలోనే సీతారామయ్యకు పరువు ప్రతిష్ఠలను సంపాదించిపెట్టాయి. చుట్టు ప్రక్కల వూళ్లల్లో కూడా అతని ఖ్యాతి వ్యాపించింది. తను సంపాదించిన సొమ్మును కూడబెట్టి కోటీశ్వరుడు కావాలనే కాంక్ష అతనికెప్పుడూ లేదు. సహాయాన్ని అర్థిస్తూ ఎవరు వెళ్లినా కాదనేవాడు కాదు! నిత్యమూ అతని పెదవులమీద నాట్యంచేసే చిరునవ్వు వెనుక అమితమైన ప్రేమ, అవ్యాజమైన అనురాగం, అంతులేని ఆప్యాయతలు దాగి వుండేవి. సీతారామయ్య ప్రేమకు, అభిమానానికి వారసు లెంతోమంది వున్నప్పటికీ అతని ఆస్తికి మాత్రం వారసుడు చంద్రం ఒక్కడే! చిన్నప్పట్నుంచీ వాణ్ణెంతో అపురూపంగా పెంచాడు వాడు బాగా చదువుకొని హోదా కల వుద్యోగి కావాలని కలలు కనేవాడు సీతారామయ్య తను ఒంటరితనాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందనే సత్యం తెల్సి వుండికూడా కాలేజీ చదువు పూర్తికాగానే పై చదువుల కోసం చంద్రాన్ని వాల్తేరు పంపించాడు. అతనికి కావల్సినదల్లా చంద్రయొక్క భవిష్యత్తు! అందుకోసం ఏం చేయాలన్నా సీతారామయ్య సిద్ధమే! మరి మేమిద్దరం అతన్ని అపార్థం చేసుకోటానికి అవకాశం ఎక్కడుంది? ఆ విషయమే అతన్ని అడిగాను.

'చూడు సీతారావుడూ! నేను నీ ప్రాణ స్నేహితుణ్ణి! నాకు తెల్సినంతవరకు నీ మనస్సుకు కష్టం కల్గేలా నే-నెప్పుడూ ప్రవర్తించలేదు ఒకవేళ తెలియక నావలన ఏదైనా పొరపాటు జరిగితే చెప్పు! దానికి నేనేమీ చిన్నబుచ్చుకోనులే! అంతేకాని అనవసరంగా ఏదో విషయాన్ని మనసులోనే దాచుకొని నీ విలా మథన పడటం నా కిష్టంలేదు'

నా మాటలకు ఆశ్చర్యపోయాడు సీతారామయ్య

'సుందరం! నీవలన పొరపాటు జరిగిందా? ఎంత మాటన్నావురా? మనం ఏ క్షణాన కల్సుకొన్నామో కాని ఈనాటి వరకు ఒకరి నొకరు విడువలేకుండా వున్నాం. అన్ని విషయాల్లోను నాకు చేదోడు వాదోడుగా నిల్చిన నీమీద నాకు కోపమా? అలా ఎన్నటికీ జరుగదురా?' అన్నాడు నా చేతుల్ని తన చేతుల్లోకి తీసుకొంటూ.

'అయితే నీ ఆందోళనంతా చంద్రం గురించేగా?'

సీతారామయ్య మాట్లాడలేదు.

'మాట్లాడవే సీతారావుడూ! నా వూహ నిజమేనా?'

'సుందరం! నీకెలా చెప్పాలో నా కర్థం కావటంలేదు. చిన్నప్పట్నుంచీ వాణ్ణెంతో అపురూపంగా చూసుకొన్నాను. నా ప్రాణానికి ప్రాణంగా భావించాను. కాని వాడికి నామీద మమకారమన్నదే లేకుండా పోయింది. ఒక్క విషయం అడుగుతున్నాను. సమాధానం చెప్పరా! వాడికి నే నెప్పుడైనా ద్రోహం తలపెట్టానా? అసలు అలాంటి ఆలోచన నాకు కలలోనైనా వస్తుందా?' ఆవేశంతో అడిగాడు సీతారామయ్య.

'సీతారావుడూ! ఏమిటి నీవనేది? చంద్రానికి నీవు ద్రోహం తలపెట్టడమా? ఎవరన్నారు? అనవసరమైన ఆలోచనలతో మనస్సు నెందుకు పాడుచేసుకొంటున్నావ్?' అని నేను అడిగేసరికి సీతారామయ్య సమాధానంగా తలగడ దిండుక్రిందున్న కవరును తీసి నా చేతికి అందించాడు.

"సుందరంగారూ! మీకు ఫోన్ వచ్చింది" అన్న ప్రకాశం పంతులుగారి మాటలు విన్పించగానే నా ఆలోచనలకు అంతరాయం కల్గి వర్తమానంలోకి వచ్చాను.

చెమర్చిన కన్లను చేతి రుమాలుతో తుడ్చుకొంటూ ఫోన్ దగ్గరకు వెళ్లాను.

అవతలి కంఠాన్ని వినగానే నాకు ప్రాణం లేచి వచ్చినట్లయింది. చంద్రం మాట్లాడేడు. తను స్టేషన్లో వున్నానని, ఇంటికి రావటానికి మనస్కరించటం లేదని, తనను వెంటనే కల్సుకోమని ఫోన్ చేసేడు. సీతారామయ్యకు సీరియస్‌గా వుందని, వెంటనే ఇంటికి వచ్చేయమనీ నేను అనగానే ఠక్కున ఫోన్ పెట్టేసేడు.

వాడి మొండి పట్టుదల, మూర్ఖత్వం నాకు విపరీతమైన కోపాన్ని కల్గించాయి. ఏమైనా చంద్రాన్ని కల్సుకొని వాణ్ణి వెంటనే ఇంటికి తీసుకురావటం అవసరమని భావించి సీతారామయ్యను జాగ్రత్తగా చూస్తుండమని ప్రకాశంగారికి చెప్పి స్టేషన్‌కు బయల్దేరాను.

సిమెంట్ బెంచీమీద కూర్చున్న చంద్రం నన్ను చూడగానే లేచి నిలబడ్డాడు

"చంద్రం! నీ ప్రవర్తన ఏమీ బాగా లేదురా!" అన్నాను నేను కోపంగా. చంద్రం మాట్లాడలేదు. మౌనంగా తలవంచుకొన్నాడు.

"చదువుకొంటున్నవాడివి, తెలివిగలవాడివి అయికూడా ఇంత మూర్ఖంగా ఎందుకు ప్రవర్తిస్తున్నావ్? చావుబ్రతుకుల మధ్య కొట్టుకొంటున్న తండ్రిని చూడాలనే ధ్యాసే లేకుండాపోయిందా?"

"మామయ్యా! నాన్నగారికి సీరియస్‌గా వుందన్న అబద్ధం చెప్పి నన్ను ఇంటికి తీసుకువెళ్లాలనుకొంటున్నావ్ కాబోలు! అది నిష్ప్రయోజనం."

"చంద్రం!" గట్టిగా అరిచాను. నా కళ్లల్లో నీళ్ళు తిరిగాయి.

"చివరకు నేనుకూడా అబద్ధాలు చెప్తున్నానని భావిస్తున్నావా? పగవాడిక్కూడా అపకారం చేయని సీతారామయ్య చావు బ్రతుకులమధ్య నలిగిపోతున్నాడని అబద్ధం చెప్పటమా?... చంద్రం! నా మాట నమ్మ! మీ నాన్నగారికి నిజంగానే సీరియస్‌గా వుందిరా!" అన్నాను కన్నీరు తుడ్చుకుంటూ.

చంద్రం ముఖ కవళికలు మారాయి. కాని అడుగు ముందుకు వేయలేదు అలానే సిమెంటుబెంచీ మీద కూర్చుండి పోయాడు.

"చంద్రం! ఆలస్యం చేయకు! ఇంటికి వెళ్దాం పద!" అన్నాను.

"క్షమించండి మామయ్యా! ఆ ఇంటి గడప త్రొక్కనని ప్రమాణం చేశాను. ఇప్పుడు

ఆత్మవంచన చేసుకోలేను'' తల దించుకొనే సమాధానం చెప్పాడు.

''చంద్రం! నువ్వేనా ఇలా మాట్లాడుతోంది?'' అంటూ ప్రక్కనే కూర్చున్నాను.

''మామయ్యా! మనిషి ఎప్పుడూ ఒకే రీతిగా వుంటాడనుకోవటం చాలా పొరపాటు! నిప్పు లక్షణం తెలియనపుడు చెయ్యి కాల్చుకొంటాడు పసిపాప. కాని వయస్సు వచ్చాక కూడా అలానే చేస్తాడనుకోవటం అవివేకం!''

''పిచ్చివాడా! వయస్సు వచ్చినా మనస్సు ఎదిగేవ్వరకాని నీలాంటి పసిపాపలు ఈ లోకంలో లేరనుకోవటం అంతకంటె అవివేకం!''



సాలోఫేన్—అమోఘమగు నిరపాయకరమైన నొప్పుల నివారిణి

SAA/AMS/1999 TEL

అమృతాంజన్ లిమిటెడ్‌వారి సుప్రసిద్ధమైన తయారీ

"మామయ్యా!" అభిమానం దెబ్బతిన్న వాడిలా చూశాడు నావైపు.

"చంద్రం! సీతారామయ్య లాంటి పుణ్యమూర్తిని నీవెందుకు అపార్థం చేసుకొంటున్నావో, ఎందుకు ద్వేషిస్తున్నావో నా కర్థం కావటంలేదు."

"నీవాయనకు ప్రాణ స్నేహితుడివి కాబట్టి నీకాయన పుణ్యమూర్తిగానే కన్పించవచ్చు! ఆయన చేసే ప్రతిపని మంచిదిగానే కన్పించవచ్చు. కాని ఆ మంచి వెనుక స్వార్థం దాగుందన్న నిజం నీ వూహకందదు."

"చంద్రం! ఏమిట్రా నీవనేది?"

"మామయ్యా! ఒకప్పుడు నీలానే నేను కూడా నాన్నగారిని అభిమానించాను! ఆరాధించాను! ఎంతో ఉన్నత వ్యక్తిగా భావించాను. కాని ఆయన్ని గురించి బయటపడిన నిజాలు నా మనస్సును దహించివేస్తున్నాయి. అలాంటివాణ్ణి తండ్రని చెప్పుకోటానికే సిగ్గుపడుతున్నాను."

"చంద్రం!" కోపావేశాలతో అరిచాను.

"ఆ మాటనటానికి నీకు నోరెలా వచ్చిందిరా? దేవునిలాంటి తండ్రిని దూషించే నువ్వుకూడా ఓ మనిషివేనా?"

"మనిషిని కాబట్టే నిజా నిజాలు తెల్సుకొన్నాను."

"ఏమిట్రా, నువ్వు తెల్సుకొన్న నిజాలు?"

"ఒకరితో చెప్పుకొనేందుకు సిగ్గుపడాల్సినవి..."

"అంత సిగ్గుపడాల్సిన పన్నేమీ సీతారామయ్య చేయలేదు."

"ఉన్న ఆస్తిసంతట్నీ దాన ధర్మాలు చేసి కొడుకును అనాథను చేయటానికి ప్రయత్నించటం, ఒక్కగానొక్క కొడుకు ప్రేమించిన పిల్లను వివాహం చేసుకొంటానంటే తీవ్రంగా అభ్యంతరం పెట్టడం — ఇవన్నీ ఏమిటి? పైకి అమృత హృదయునిలా కన్పిస్తూ హృదయంలో హాలాహలాన్ని దాచుకొన్న దానవుడు! ఓ ఆడదాని వ్యామోహంలో పడి మా తల్లిని చేతులారా చంపిన కిరాతకుడు" ఆవేశంగా అన్నాడు.

"చంద్రం! నీవిలా మాట్లాడటం నాకేం నచ్చలేదు! అసలివన్నీ నీవంటున్న మాటలు కావు! నీ మనస్సును ఎవరో కలుషితం చేశారు. సీతారావుణ్ణి, నిన్ను విడదీయటానికి ఎవరో కుట్ర చేస్తున్నారు ప్రాణాని కంటే మిన్నగా ప్రేమించిన భార్యను చంపేటంత దుర్మార్గుడా మా సీతారావుడు? నాయనా చంద్రం! ఈ కట్టుకథలువిని మోసపోవద్దు! అవతల అతని పరిస్థితి బాగోలేదు. వెళ్దాం, రా!" అంటూ చేయిపుచ్చుకొని లేవదీశాను.

"మామయ్యా! కట్టుకథలని మీరు త్రోసిపుచ్చినంత మాత్రాన నిజాలు అబద్ధాలు కావు! నా తల్లిమీద ఎనలేని ప్రేమేవుంటే తిండికి గతిలేని ఓ కూలిదాన్ని చేరదీయాల్సిన అవసరం ఆయనకేమొచ్చింది?"

ఆమాటలు వినగానే నేను కొయ్యబారి

ఖరీదైన షాంపూలు మీరు వాడుతున్న ప్రతిసారీ
మీ డబ్బు నీళ్ళపాలే—అందుకే తలంటుకొనేందుకు వాడండి..

స్వస్తిక్
షికాకాయ్
షాంపూ సబ్బు

ద్రవపదార్థపు షాంపూలలోగల
అన్ని లక్షణాలు ఉన్నా
ఖరీదు మాత్రం తక్కువే!



స్వస్తిక్ షికాకాయ్ షాంపూ సబ్బులో
భారత స్త్రీల అందమైన జుట్టుకు పారంపర్యమైన
రహస్యం షికాకాయ్ ఉంది.

పోయాను. నేను అనుకొన్నంతా అయింది. భూషణం చంద్రం మనస్సు పాడుచేశాడు. భూషణమంటే ఆవూరి ఛైర్మన్. అతను ఛైర్మన్ కావటానికి వెనుక చాలాగాథవుంది. ఛైర్మన్‌కాకముందు అతనుకూడా సీతారావుని లాగానే కంట్రాక్టులు చేస్తుండేవాడు. సీతారావుడికి కీర్తి ప్రతిష్టలు మిన్నుముట్టడంతో అతనికి కన్నుకుట్టింది. దూరదేశాలకు వెళ్లి పలుకుబడిని సంపాదించి తద్వారా పెద్దపెద్ద కంట్రాక్టులను చేపట్టి మళ్లీ కొన్ని సంవత్సరాల అనంతరం ఆవూరికే చేరుకొన్నాడు భూషణం. తను సంపాదించిన డబ్బును వుపయోగించుకొని ఛైర్మన్ పదవిని కొనుక్కున్నాడు అనతి కాలంలోనే. అతని కూతురు కూడా వాల్తేరులోనే చదువుతోంది. చంద్రం ఆ అమ్మాయిని ప్రేమించాడన్న విషయం సీతారావుడిద్వారానే నాకు తెల్సింది. 'ఏదైతే జరగకూడదనుకున్నానో అదే జరిగింది సుందరం!' అని సీతారావుడు ఒకసారి చాలా బాధపడ్డాడు.

''చంద్రం! ఇంతకూ నీకా విషయాన్ని చెప్పింది ఆ భూషణమే కదూ!'' అన్నాను.

''ఎవరు చెప్పినా నిజం నిజమే!''

''హుఁ! నిజం! ఏదిరా నిజం? అసలు నిజానిజాలు ఆ భూషణానికి, నీకు ఏం తెలుసు? ఆ నిజమే తెలిస్తే మీరిద్దరూ పిచ్చివాళ్లుగా మారి తలలు బద్దలుకొట్టుకునేవారు. నీ కసలు మనుషుల్ని అర్థం చేసుకొనే శక్తి ఎక్కడుందిలే? వాడి కూతురి వలలోపడి నిన్ను నమ్మిన వారికి ద్రోహం తలపెట్టావ్! ఆ భూషణం తేనెపూసిన కత్తి! వాడి మాటలన్నీ అబద్ధాలు! నామాటనమ్ము చంద్రం!''

''అయితే నా తండ్రి కూలిదాన్ని చేరదీసిన విషయంకూడా అబద్ధమేనా?'' సూటిగా ప్రశ్నించాడు.

నేను క్షణంపాటు మాట్లాడలేకపోయాను.

''ఆ ప్రశ్నకు నువ్వు సమాధానం చెప్పలేవు మామయ్యా! నేను భూషణం గారమ్మాయిని ప్రేమించాననేగా మీరంతా ఆయన మీద అభాండాలు వేస్తున్నారు''

''చంద్రం! ఎవరు ఎవరిమీద అభాండాలు వేస్తున్నారో అర్థంచేసుకొనే క్షణం వచ్చింది. ఈ క్షణం రానీయవద్దని సీతారావుడు నా దగ్గర మాట తీసుకొన్నాడు. ఎంతోకాలం నుంచి ఈ రహస్యాన్ని నా గుండెల్లోనే దాచు

కొన్నాను. కాని ఇప్పుడు చెప్పక తప్పటంలేదు సీతారావుడు కూలిదాన్ని చేరదీశాడన్నావు. ఆమాట నిజమే! కాని ఆమె ఎవరో భూషణానికి ఈక్షణం వరకూ తెలీదు. ఆవిషయమే తెలిస్తే గుండె పగిలి చస్తాడు.''

''మామయ్యా! నువ్వు చెప్పేదేమిటో నా కర్థం కావటంలేదు'' ఆశ్చర్యంగా అన్నాడు చంద్రం.

''చెప్తాను చంద్రం! చెప్తాను! నీకు అర్థమయ్యేలా చెబుతాను! భూషణం ఛైర్మన్ కాకముందు కంట్రాక్టులు చేసేవాడన్న విషయం నీకు తెల్సినా, సీతారావుడుపట్ల అసూయ, ద్వేషాన్ని పెంచుకొన్నాడన్న విషయం నీకు తెలీదు! భూషణం దగ్గరే పనిచేసేవాడు నాగయ్య అనే మేస్త్రి. అతను హఠాత్తుగా అక్కడ పని మానేసి సీతారావుడు ముఠాలో చేరేసరికి భూషణం ఉగ్రుడైపోయాడు. నాగయ్య అలా చేయటానికి కారణం లేకపోలేదు. అతని భార్య కూడా కూలిపనిచేసేది. భూషణం కన్ను ఆమెమీద పడింది. ఓసారి బలవంతం చేయబోయి విఫలు డయ్యాడు. నాగయ్య సౌమ్యుడు కాబట్టి భూషణంప్రాణాలతో బ్రతికాడు. సీతారావుడిపనిలో వుంటున్న నాగయ్య అకస్మాత్తుగా ప్రమాదానికి గురై మేడమీదనుంచి క్రిందపడి మరణించాడు. అతని మరణంతో భార్య ఏకాకి అయింది. ఆమె అందమే ఆమెకు శత్రువై రక్షణ లేకుండా పోయింది. ఆ పరిస్థితుల్లో సీతారావుడు ఆమెను ఆదుకొన్నాడు. తమఇంట్లో నౌకరీ యిప్పించి ఆమెకోసం విశాలమైన తన ప్రాంగణంలో ఓ యిల్లును కూడా ఏర్పాటు చేశాడు. కాని ఆమె ఆ యింట్లో ఎక్కువకాలం జీవించలేక పోయింది. ఓ మగ

రాలిన ముత్యాలు

........శ్రీ సోమసుందర్.........

వ్యక్తి వ్యక్తాలాపన
సాహిత్యవిమర్శ కానేరదు...
శక్తి శక్తివంతమై తేనే తప్ప
మౌక్తికం ఆవిర్భవించదు!

బిడ్డను ప్రసవించి మరణించింది. సీతారావుడు మనస్సులానే అతని భార్య మనసు కూడా ఎంతో సున్నితం. అందంగా బొద్దుగా వున్న ఆ కుర్రాణ్ణి దంపతులిద్దరూ వదల్లేకపోయారు. తమకు పిల్లలులేని లోటు ఆ రకంగా తీరిందని భావించి ఆ కుర్రాణ్ణి దత్తు చేసుకొన్నారు......''

''అయితే నేను... ... ...''

''సీతారావుడి దత్తపుత్రుడివి!''

''మామయ్యా!'' గట్టిగా అరిచాడు చంద్రం.

వాడి ముఖంలో ఆశ్చర్యం, దుఃఖం చోటుచేసుకొన్నాయి.

''నువ్వు చెప్పేదంతా నిజమేనా మామయ్యా!'' వణుకుతున్న కంఠంతో అడిగాడు.

''నాయనా, చంద్రం! భూషణం చెప్పిన మాటలు విని మనస్సును చెడగొట్టుకున్న నీకు నా మాటలు కట్టుకథలుగా అన్పించవచ్చు! కాని నేను నా సీతారావుడి కిచ్చిన మాటను కూడా నిర్లక్ష్యపర్చి నిజాన్ని నీకు చెప్పాను. కీర్తి జ్వాల లాంటిది. ఆ జ్వాల ప్రకాశించటానికి పూర్వాపరాలు పొగపుట్టడం సహజం. బహిర్గతమైన పొగను చూసి దాని వెనుకనున్న జ్వాలయొక్క వునికిని మర్చిపోగలవాచెప్పు! ఆలశ్యం చేయటానికిది సమయం కాదు! సీతారావుడి కెలావుందో? త్వరగా వెళ్దాం...రా!'' అంటూ ముందుకు నడిపించుకు వెళ్లాను.

నాల్గడుగులు వేశాక ''మామయ్యా! నన్ను క్షమించండి! కన్న తండ్రి కంటె మిన్నగా ప్రేమించి పెద్దచేసిన ఆ పుణ్యమూర్తికి అజ్ఞానంతో లాయర్ నోటీసు యిప్పించాను ఆస్తికోసం! నేను క్షమించరాని నేరం చేశాను. నా ముఖాన్ని వారికి చూపించలేను...'' అంటూ వెక్కి వెక్కి ఏడ్చాడు చంద్రం.

''పిచ్చివాడా! తప్పులు చేయడం మానవ సహజం! తన కొడుకు చేసిన తప్పునుక్షమించలేనంత కఠిన హృదయుడు కాదు మా సీతారావుడు. నీకోసం వేయి కళ్లతో ఎదురు చూస్తుంటాడు...వెళ్దాం...పద...'' అంటూ చంద్రాన్ని స్టేషన్ బయటకు తీసుకువచ్చి ఇద్దరం టాక్సీ ఎక్కాం! టాక్సీ సీతారావుడి యింటిముందు ఆగేసరికి అక్కడ చాలామంది జనం గుమిగూడి వున్నారు.